పశువైద్య గ్రంథమాల 19 వ పుష్పము

# పశునేత్రచికిత్స

గ్రంథకర్త:

"అభినవ సహదేవ" ఆయుర్వేద పశువైద్యాచార్య, వైద్యకళా విభూషణ, పశువైద్యగ్రంథమాల, ఆయుర్వేద పశుచికిత్సాలయ సంస్థాపకులు, ఆంధ్ర జాతీయ పశువైద్య విద్యాపీఠ ప్రెసిడెంటు, ఆంధ్ర జాతీయ పశువైద్య కళాశాలప్రిన్సిపాల్ నగు,

డాక్టర్ యేజెళ్ల శ్రీరాములు చౌదరి,


A. V. L. M. & S., A. M. B. & B.S.

అంగలూరు, కృష్ణాజిల్లా.

1937

సర్వస్వామ్యసంకలితము]

[వెల రు 0-8-0.



గ్రంథకర్త:
"అభినవసహదేవ"
మేజెళ్ల శ్రీరాములుచౌదరి

# విజ్ఞప్తి

నేను సుమారు పదిసంవత్సరములక్రిందట ఆయుర్వేద పశుచికిత్సాలయమును ఆయుర్వేద పశువైద్య గ్రంథమాలను స్థాపించి అనుభవపూర్వకముగా నపుడపుడు పశువైద్య గ్రంథముల బ్రకటించుచు వార్తాపత్రికలలో వ్యాసములువ్రాయుచు నా శక్తికొలది పశుసేవ చేయుచున్నసంగతి తామెల్లరకును దెలిసియేయున్నది. నేను వ్రాసిన గ్రంథములనుబట్టియు, నాయొద్ద తరిబియతయిన వైద్యులద్వారాను, కరపత్రముల మూలకముగను ఆంధ్రదేశమందంతటను ఆయుర్వేద పశువైద్యమును వ్యాపింపజేసితిని.

మరియొక ముఖ్యవిషయమేమన నేనిపుడొక ఆంధ్రజాతీయ పశువైద్య కళాశాలను స్థాపించి గవర్నమెంటువారిచే రిజష్టరు చేయించి యనేకమంది పశువైద్యులను తరిబియతు చేయుచున్నాడను. ఈకళాశాల ప్రభుత్వమువారివలన ద్వరలో రికగ్నైజు కానున్నది.

ప్రస్తుత కాలపరిస్థితులనుబట్టి రైతులకును విద్యార్థులకును తదితరులకును అర్థమగునటుల సులభశైలియందు ఇరువది పశువైద్య గ్రంథములను మాపశువైద్య గ్రంథమాలతరఫున బ్రకటించితిని. మా యాయుర్వేద పశువైద్య గ్రంథమాలయందు వెల్వడిన గ్రంథరాజములం దిదియు నొక్కటి. ఇయ్యది

పశుధనాభిమానులగు హైందవులకెల్లరకును హస్తభూషణమని చెప్పనగును.

మా యీగ్రంథములపై గవర్నమెంటు వెటరినరీ, అగ్రికల్చరల్, రెవిన్యూ, ఎడ్యుకేషనల్ డిపార్టుమెంటులయందలి ప్రముఖులగు నుద్యోగులును తదితర డిపార్టుమెంటులవారును జమీందారులు భూస్వాములు మున్నగు వారు పెక్కురు పెక్కు సదభిప్రాయముల నొసంగియున్నారలు.

మా యీ గ్రంథముల నాంధ్రలోకమాదరించి ప్రతి పాఠశాలయందును, ప్రతిపుస్తక భాండాగారమందును, కోఆపరేటివు సొసైటీలయందును ఉంచి మాపశువైద్య గ్రంథమాల నభివృద్ధికి దెత్తురని విశ్వసించుచున్నారము.

ఈ గ్రంథమునకు దయతో పీఠిక వ్రాసి వన్నెదెచ్చిన పశుధనాభిమాన శిరోమణికిని ముద్దులొలుకునటు లీ గ్రంథమును త్వరలో ముద్రింపించి యిచ్చిన గ్రంథాలయప్రెస్సు మానేజరు శ్రీ కుందా లక్ష్మీనరసయ్యగారికిని, నా యీ గ్రంథ రచనమునకు సాయపడిన గ్రంథముల రచయితలకును నా హృదయపూర్వక వందనము లర్పించుచున్నాడను.

ఇట్లు,

గ్రంథకర్త.

# పశునేత్రచికిత్స

## పశువైద్యసూత్రములు

(1) పశువు నోరులేని జంతువుగాన మనుష్యులే వాటిని బాగుగా పరీక్షించి తగినవైద్యాది సదుపాయములు చేయవలయును.

(2) పశువుశరీరమునకు ఎముకలే ఆకారమును కలుగజేయును. ఎముకలులేనిచో పశువు ఒకమాంసపుముద్దగా నుండును. శరీరమునందు చాల కోమలములు, సుకుమారములునగు మెదడు, వెన్నెముక, హృదయము, ఊపిరితిత్తులు మున్నగు అవయవములు ఎముకలగూళ్ళలో నమర్పబడియున్నవి.

(3) పశువునకు మంచి ఆకలిపుట్టుట, సరిగా ఊపిరి పీల్చుట, బాగుగా పేడవేయుట మొదలగునవి సక్రమముగా జరుగుచున్నచో ఆపశువు ఆరోగ్యముగా నున్నదని గ్రహించవలెను.

(4) పశువులు సుఖస్థితియం దుండునపుడు గుంపులో కలసిమెలసి, వలసినపుడు మేతమేయుచు, కాలమెరిగి నెమరవేయుచుండును. చెవులు మాటిమాటికిని ఆడించుచుండును. ముక్కు మూతి చెమ్మగలిగియుండవలెను. కన్నులు నిర్మలము

గను, కాంతిగనుండును. చర్మము మృదువుగనుండును. వెంట్రుకలు చర్మముమీద వ్రాలియుండును. పశువులు ఒకదానినొకటి నాకికొనుచు ఆలోచితముగా పేడవేయును. ఆపేడ మెత్తగా నుండును. ధారాళముగా మూత్రముపోయును. ఏయంగమందును వాపుగాని, కుంటుగాని లేకయుండును. ఈ లక్షణములన్నియు సుఖజీవితమును తెలుపును. అట్లుండక మందవిడిచి, దూరముగాపోయి నల్లకప్పు వేసికొనియుండిన యెడల ఆపశువు అనారోగ్యముగానున్నదని గ్రహించవలెను.

(5) కొమ్ములు వెచ్చగాను, ముక్కుఎండి మూతి చెమ్మలేక వెచ్చగానుండి మూత్రము పసుపురంగువలె కొంచెము కొంచెము పోయుచు, పేడ గట్టిగావేసి మేతమాని మిక్కిలి దాహముగొనియుండెనేని అట్టిపశువునకు జ్వరము తగిలినదని గ్రహించవలెను.

(6) పశువుప్రాణమునకు గాలి ముఖ్యాధారము. అది లేనిదే ఒకనిమిషమైనను జీవింపలేదు. సర్వావస్థలయందును పశువులు గాలి పీల్చుచుండును. అట్టి గాల పరిశుభ్రమైనదిగా నుండవలయును.

(7) పశువు ఆహారములేకుండ కొన్నిదినములవరకుండగలదు గాని, దాని శరీరశక్తి నశించి అవయవములబలము క్షీణించును.

(8) పశువు గాలి సరిగపీల్చకపోవుటచేతనే శరీరమందు ప్రాణశక్తి క్షీణించును. అప్పుడే పలువిధరోగముల పాలగును.



(9) నిలువయుండిన గుంటలో నీరుగాని, మురుగునీరుగాని పశువులను త్రాగనీయరాదు. అట్లు త్రాగనిచ్చినచో అవి పలువిధముల సంకటముల పాలగును.

(10) జిడ్డు, రక్తము, గువిలి, మూత్రము, పుసులు, చెమట, చీమిడి, చొంగ మొదలగునవి అపరిశుద్ధములు.

(11) పశువును కష్టపెట్టి పనిచేయించిన వెంటనే నీరు త్రాగించరాదు. అట్లు త్రాగించినయెడల ఆరోగ్యముచెడును.

(12) పశువులను ఎండ వానలకు పాలుగానీయక కాపాడుచుండవలెను. ఆహారవిహారములందును, పాటుపడునప్పుడును, పశువులను మిగుల జాగరూకతతో చూచుచుండవలెను.

(13) పశువులకొట్టము యొక్క భూమిమట్టము చుట్టుప్రక్కల కంటె నెత్తుగానుంచి ఏటవాలుగా మలమూత్రాదులు క్రిందికి జారునట్లుగా బరంతు వేయవలెను.

(14) చలిగాలి తగులకుండునట్లు పశువులకు తగినకొట్టములు కట్టించవలెను. కిటికీలు చాలినంత వెలుతురు వచ్చునవిగా నుండవలయును.

(15) కొట్టములలో పేడ, త్రొక్కుడుగడ్డి నిలువయుంచరాదు. ఆ యెరువునంతను పశువులుండు స్థలమునకు చాల దూరముగా లోతైనగోతులుత్రవ్వి, వానిలో వేయించవలెను. ఇట్లు చేయుటచే దోమలు మొదలగునవి రాజాలవు.

(16) పశువుకొట్టముల గోడలకు సంవత్సరమున కొకసారి సున్నము కొట్టించినయెడల విషక్రిములు చేరజాలవు.

(17) వ్యవసాయమునకు పనికివచ్చు పశువులను తదితర పశువులలో చేరనీయక ప్రత్యేకస్థలములందు కట్టివేసి చక్కగా మేపవలయును. వారముదినముల కొకసారి పశువులను నీళ్లతో శుభ్రముగా కడుగుచుండవలెను.

(18) పశువులు క్రిక్కిరిసి యుండునట్లు చేయరాదు. ప్రతిపశువునకు పరుండుటకుస్థలము విశాలముగా నుండవలెను. పశువులదగ్గర గోతులలో క్రుళ్లు తీసివేయుచుండవలెను.

(19) పశువుల కొట్టములు శుభ్రముగా నూడ్చుచుండవలెను. గొడ్లకు చిట్టు, తవుడు మున్నగు నాహారపదార్థములు పెట్టుటకు పేడబూసిన బుట్టల నుపయోగించవలెను.

(20) ప్రక్కపశువు తగులకుండునట్లు పలుపులు కురచగా నుండవలెను. లేనిపక్షమున పశువు లొకదాని నొకటి రాచుకొని పొడుచుకొని త్రాళ్ళు తెంపుకొని అల్లరిజేయును.

(21) గుంజకును గుంజకును మధ్య నాలుగడుగుల దూర ముండవలెను. పలుపులు కొంచెము పొడుగుగా నుండినగాని పశువులు పండుకొనునపుడు లేచునపుడు వీలుగానుండదు. గుంజల పాతుటకంటె గాడితొట్టెలలో నినుపరింగు లమర్చి వానికి పలుపులతమ్మెలు పెట్టుట మంచిది.

(22) పశువులతోకలను విరువగూడదు. అందుచే పశువులకు కోపము క్రౌర్యము కలుగును. లేనిచో అవి మొద్దుబారిపోవును.

(23) జబ్బుగానున్న పశువులకు తగినంతమేత మేపవలయును. గంజి, జావ, పచ్చిమేత మొదలగునవి పెట్టవలయును. ఇంతియేకాక ఆపశువును నీడగలస్థలమునందుంచి సారవంతమైనట్టియు సులభముగా జీర్ణమగునట్టియు ఆహారమును పెట్టుచుండవలెను.



(24) జబ్బుగానున్న పశువులకొట్టములోని అడుగుభాగమును పారతో గీకించి మరల క్రొత్తమన్ను పోయించి దిమ్మెసతో కొట్టించవలెను.

(25) అంటువ్యాధులు సోకిన పశువులను ప్రత్యేకస్థలమునం దుంచి చికిత్సలు చేయుచుండవలెను. రోగముతోనున్న పశువులమలమూత్రాదులు ప్రతిదినము తీసివేసి అచ్చటిచెత్తనుకాల్చి శుభ్రముచేయవలెను.

(26) ఆపశువుల పేడతో పిడకలుచేయరాదు. ఊడ్చిన స్థలమందు ఫినైల్‌గాని, కర్పూరతైలముగాని చల్లవలెను.

(27) అంటువ్యాధిగల పశువు చనిపోయినచో మాదిగవాండ్రచే కోయించక దూరముగా తీసికొనిపోయి సున్నము, ఉప్పువేసి పాతిపెట్టించవలెను.

(28) రోగముతో నున్నపశువులకు దగ్గరగానుండు వ్యవసాయసామగ్రిలు (గుంజలు, గాడి) మొదలగు పనిముట్లు సున్నపునీటితో చక్కగా కడుగవలెను.

(29) ఔషధము త్రాగించునపుడు పశువుయొక్క తలను ఎత్తిపట్టుకొని నోరు తెరచి ఒక్కొక్క గుక్కవంతున త్రాగించవలెను.

(30) దగ్గునట్లు పశువుకనబడెనేని పట్టువిడచి దగ్గనిచ్చిన తర్వాత మందు నోటిలో పోయవలెను. లేనియెడల ఊపిరి గొట్టములోనికి మందుపోయి దగ్గలేక కొన్ని పశువులు మృతి నొందును.

(31) పశువుల పుండ్లను శుభ్రముగా నుంచవలెను. దినమునకు రెండుసార్లు వేడినీటితో కడిగినతర్వాత గాయములకు కట్లు కట్టవలెను.

(32) చాలా పెద్దగాయములుగాని, కాలపుండ్లుగాని యున్నయెడల వానికట్లను బలవంతముగా నొకేసారి తీయరాదు. అట్లు తీయుటచే గాలిలోనుండు సూక్ష్మజీవులు ప్రవేసించి పురుగులు పడును. కట్లు రసితో అంటుకొనినయెడల వాని మీద వగరునీరుపోసి తడిపి మెల్లగా తీయవలెను.

(33) పశువుల నెంతశుభ్రముగానుంచిననంతఆరోగ్యముగానుండునని మన కెల్లరకు తెలిసిన విషయమే కాబట్టి ప్రతికృషీవలుడు వానిని శుభ్రముగా కడుగుచు మంచిస్థితియందుంచుట అత్యంతవసరము.

(34) వేసవికాలములో వారమునకు రెండుసార్లును శీతాకాలములో నెలకొకసారియును పశువులను చెరువులలోనికి, గుంటలలోనికి, పారుచున్న నదులలోనికి దింపి శుభ్రముగాకడిగి శరీరము ఆరునంతవరకు ఎండలో త్రిప్పవలయును.

(35) పాడిగొడ్లలో శీతాకాలమునం దెక్కువగా నీటితో కడుగరాదు. ఎండలువేయుచున్న సమయములోనే కడుగవలెను. ఆరునెలలకు తక్కువగానుండు దూడలను కడుగరాదు.



(36) మంచిపశువుల శరీరము బ్రష్‌తో తుడిచినయెడల గోమారులు, పేలు, మిణ్ణల్లులు మున్నగునవి పట్టక శుభ్రముగా నుండును. పశువులను బహిరంగ ప్రదేశములలో శరీర పరిశ్రమ కలుగుటకు త్రిప్పుచుండవలయును.

(37) దీర్ఘవ్యాధులకు తప్ప ఆకస్మిక వ్యాధులకు ఎక్కువగా మందులను వాడరాదు. అట్లు వాడినయెడల పశువునకు ప్రాణాపాయము రాగలదు.

(38) పశువు మిక్కిలి బలహీనముగా నున్నయెడల, ఆహారము తినుటకుగాని, త్రాగుటకుగాని లేవదీయరాదు. అది లేవలేదను నుద్దేశముతో శరీరముపై దెబ్బలు కొట్టరాదు. పరుండనిచ్చియే నెమ్మదిగా ఆహారము పెట్టవలెను.

(39) అన్నివ్యాధులయందును ముఖ్యముగా తీవ్రదశయం దున్నప్పుడు కఠినపదార్థముల నాహారముగ వాడుట మానివేసి ద్రవపదార్థములను మాత్రమే వాడవలెను.

(40) వ్యాధిగల పశువులకు ఒకేసారి ఆహార మంతగా పెట్టరాదు. కొంచెము కొంచెముగా పెట్టుచుండవలెను.

(41) పశువును చీకటిగదిలో నుంచరాదు. తీక్ష్ణమైన వెలుతురు అవసరము. అట్టి వెలుతురు పశువుమెదడునకు అవసరమైనట్టియు, అత్యధికమైనట్టియు చురుకుదనము బుట్టించును.

(42) పశువు అనారోగ్యముగ నున్నట్లు తెలిసినవెంటనే దానికి విశ్రాంత నీయవలయును. అట్లు విశ్రాంతి ఇచ్చినయెడల పశురోగము త్వరగా నెమ్మదించును.

(43) రోగము నెమ్మదించినతరువాత పశువును నీటితో శరీర మారునంతవరకు చక్కగా కడుగవలెను.

(44) రోగము నెమ్మదించిన తరువాత పశువును కొట్టములోనుండి బయటికితీసినతరువాత కొట్టపుగోడలను లోపను నీటితో కడుగవలెను.

(45) ఒక గ్రామమునందు అంటువ్యాధి ప్రారంభించినపుడు రోగముసోకినపశువులను ప్రత్యేకముగానుంచి, తగినంత చికిత్స చేయవలెను.

(46) సుఖముగా నుండు పశువులను ఉదయ సాయంకాలములందు పరీక్షచేసి జాడ్యము సోకినట్లు అనుమానముగా నున్నవాటిని ప్రత్యేకముగా నుంచవలెను.

(47) కల్మషములు పశువుశరీరముమీద నిలిచియున్నయెడల అవయవములు సరిగా పనిచేయక గజ్జి, తామర, నుసిమిరి, పొడ మున్నగు చర్మవ్యాధులు పుట్టును.

(48) గేదెలకు మంచినూనెగాని, వ్యాసిలైనుగాని, చర్మమునకు పూసి స్నానము చేయించిన చాలా ఆరోగ్యముగా నుండి పాలు బాగుగా నిచ్చును.

(49) పాడి పశువులకు తవుడు ఎక్కువగా మేపరాదు. అట్లుమేపినచో వాతరోగములు ప్రారంభమై పశువుల కపాయము తటస్తించును.

(50) చనిపోయినపశువులను కొందరు పాతివేయుదురు. కాని మనుష్యులవలెనే పశువులనుగూడ కాల్చుటయందెట్టి ఆక్షేపణయులేదు.



(51) పాతివేయు గోతులుమాత్రము 10, 12, అడుగుల లోతునకు తక్కువగా నుండరాదు. చచ్చిన జంతువులను పారవేయుశ్మశానములు కాపురముండుస్థలములకును జలాశయములకును సాధ్యమైనంత దూరముగా నుండవలెను.

(52) కళేబరములను నదులలో పారవేయుటయు శిఖరములపై వదలివేయుటయు దుర్గంధమునకు మూలకారణములగుటయే గాక అనేకరోగములకు కారణము లగును.

(53) అంటువ్యాధులను రెండువిధములుగ నెంచవచ్చును.

1. ఒక పశువునుండి మరియొక పశువునకు శరీరముయొక్క అస్వస్థతాభాగస్పర్శవలననేగాని మరి యే విధముగను వ్యాప్తినొందదు.

2. వాయుమార్గమునగాని, జలమార్గమునగాని వ్యాప్తినొందును.

(54) కొన్నిఅంటువ్యాధులందు ప్రత్యేకములగు సూక్ష్మజీవులు పశువుశరీరమునందు ప్రవేశించిననేగాని లేకపోయినయెడల వ్యాధులుకలుగనేరవు.

(55) ప్రతివ్యాధియును కొంతనియమితకాలము పశువుశరీరము నాశ్రయించియుండును. ఈ నియమితకాలము అనేక కారణములను బట్టి వ్యాధిగలపశువులయందు మార్పుగ నుండవచ్చును.

(56) చచ్చినవాటిని కోయువారలనుగాని, అంటుసోకియుండు స్థలములలో దిరుగుకుక్కలనుగాని, కాకులనుగాని మంచిపశువు లున్న ప్రదేశములకు రానీయరాదు.

(57) అంటురోగము గ్రామమునందంతటను వ్యాపించి యున్నప్పుడు అలసటను గలిగించు పనులను పశువులచే చేయించరాదు.

(58) రైతులు తమమూఢవిశ్వాసముచేతను, వైద్యుడు సమయమునకు దొరకక పోవుటచేతను ఆపత్కాలమందు రాబోవుఆపదలను తెలిసికొనలేక కనబడిన ప్రతియాకుపసరును వ్యాధిసంభవించిన పశువులకు వాడుటచే వెంటనే ఆ పశువు తనప్రాణములను కోల్పోవుచున్నది.

(59) రైతులలో కొందరు భూతవైద్యులను రప్పింతురు. మరికొందరు, దురాయికట్టింతురు, మరికొందరు మంత్రములను పెట్టింతురు కాని పశువైద్యులలో నిటువంటివారు పూర్వకాలమం దుండెడివారని నమ్మవచ్చునుగాని ఇప్పటికాలస్థితుల ననుసరించి నమ్ముటకు వీలుగాకున్నది.

(60) నోరులేనిపశువు వ్యాధియొక్క ముందునడకను గుర్తించుటకు మిగుల అనుభవమును, మంచిబుద్ధికుశలతయును గావలయును.

(61) వ్యాధియొక్క ముందునడకను సరిగా చెప్పగలుగుటకు వైద్యుడు సహజగమనమును జక్కగా దెలిసినవాడై, ఆరోగ్యముయొక్క సహజతత్వమును ఎరిగినవాడై తా నుపయోగించు ఔషధములయొక్క గుణములను, శక్తులను, గ్రహించుటయందు మిగుల అనుభవముగలవాడునై యుండవలెను.

(62) వ్యాధియొక్క ముందునడకనుగూర్చి వైద్యుడు తనంతట తాను పశువు యజమానికి చెప్పరాదు. ఎవరైన



అడిగినయెడల తెలిసియున్న సంగతి మాత్రమే చెప్పవలెను. అనుమానముగా నున్నసంగతి చెప్పుటయందు బహుజాగ్రత్తగా నుండవలెను.

(63) వైద్యులు చెప్పుసంగతులు సాధ్యమైనంతవరకు ఆశను పుట్టించునవిగా నుండవలెను. స్పష్టముగా పశువునకు మరణము సంభవించు స్థితియందు వైద్యుడు తానెరిగిన సంగతి నంతయు స్పష్టముగా యజమానునకు చెప్పవలెను.

(64) పశువుయొక్క దేహతత్వము తెలియువరకు మందులు కొద్దికొద్ది మోతాదులతో వాడుట మంచిది.

(65) చూడిపశువుల విషయమై తగినంత శ్రద్ధతీసికొని లక్షణములు గ్రహించి తగినమం దీయవలయునుగాని, ఇతర పశువులకువలె ఈపశువులకు మందు లీయకూడదు.

(66) అన్ని మందులలోను కలియు వస్తువులు క్రొత్తవిగను, పరిశుభ్రమైనవిగను చేర్చవలెను. ప్రాతవస్తువులు, నిస్సారమైనట్టియు పుచ్చిపోయినట్టియు మూలికలను వాడరాదు.

(67) వస్తువులన్నిటిని జాగ్రత్తగా పరిశీలించి, బాగుచేయించి, ఎండబెట్టి ప్రత్యేకముగా చూర్ణముచేయించి, వస్త్రకాలితము చేయవలసినవి చేయించి, భాగముల ప్రకారము మందులలో కలుపవలెను. లేనియెడల భాగములలో తేడాలు గలిగి మందులు సరిగా పనిచేయకపోవును. కొన్నిమందులను చూర్ణములరూపమున పశువుశరీరములోపలి కీయవలసియుండును. ఆ చూర్ణములలో ఉపయోగింపబడు పదార్థములు

గడ్డగాగాని, పలుకులుగాగాని యుండవచ్చును. అట్టివానిని చితుకగొట్టవలెను.

### పశు నేత్ర చికిత్స

సకలేంద్రియములలోను నేత్రములుముఖ్యమైనవిగావుననే "సర్వేంద్రియాణాం నయనం ప్రధానం" అనిపెద్దలు చెప్పియున్నారు. గుడ్డితనము వచ్చినపశువు దానిజన్మంతయు వృధాయే యగును. భగవంతుని సృష్టిలోగల విచిత్రవస్తువులను చూడజాలదు. కాబట్టి ప్రతిరైతును తనపశువుకన్నులకు ఏమాత్రము జబ్బుచేసినను వెంటనే చికిత్సచేయించవలెను. కొన్నిపశువులకు ఒక కంటికిమాత్రమే జబ్బుచేయును. అందువలన కన్నులను పరీక్షించుటలో నిపుణులగువారి సహాయము కోరవలెను. అట్లు చేయనిచో బాగుగానున్న కంటికి పని హెచ్చుగనుండి రెండవ కంటికి అలవాటు తగ్గిపోవును. ఈరీతిగా పశువు రెండుకన్నులకు జబ్బుచేయును. గొప్ప గొప్ప వైద్యశాస్త్రజ్ఞులుకూడ ఈకంటి రోగముల భేదము లతిసూక్ష్మములగుటచే వానిని కనుగొనుటకై యెంతయోకష్టపడుచున్నారు.

రోగముకనుగొనినపిదప చికిత్సచేయుట: రోగనిదానము (Pathology)ను తెలిసికొనుట ఎంతకష్టమో చికిత్సచేయుట కూడ అంతకష్టమైనపని. నేత్రరోగచికిత్సలకు వలయుసాధనము లతిసూక్ష్మములగుటచే వాటిఖరీదులుకూడ నెక్కువగానుండును. నేత్రములయం దెట్టి చిన్న బాధయైనను ఆ వ్యాధికి ప్రారంభముననే చికిత్స జేయకున్న కొలదికాలములోనే కొండంతయై



కండ్లు ఎర్రగనుండుట, సహించలేనంతబాధ కలుగుట, వెచ్చని నీరు కన్నులనుండి గారుట, కనురెప్ప లుబ్బి కండ్లు పుసులు దురదలు గలుగును. దృష్టితగ్గును. కండ్లకొలుకులలో దుర్మాంసము పెరుగును. కనురెప్పల మీద కురుపులు లేచును. రేజీకటి మొదలగు వ్యాధులుకూడ గలుగును. చాలవరకు నేత్రరోగముల కన్నిటికి మందు లుపయోగించు టవసరము. నేత్రచికిత్సలకు ముందు రోగపశువు మెదడును శుభ్రపరచుట ప్రధమకర్తవ్యము. తరువాత పేగులను శుభ్రపరచవలెను. ఇంకను దేహమునకు బలముకలిగించవలెను. జీర్ణశక్తిని వృద్ధిచేయవలెను. పశువులకు మోటారులైటుల వెలుతురును, గ్యాసులైటుల వెలుతురును, విద్యుచ్ఛక్తి వెలుతురును ఎక్కువగా నేత్రములకు సోకనీయరాదు. అట్లుసోకనిచ్చినచో పలువిధములైన వ్యాధులు జనించును.

### అనుభవముగలవారిచే చికిత్స చేయించవలెను.

పశువైద్యములో ఎక్కువ అనుభవముగల వారినే మంచిసలహా లడిగి నేత్రవైద్యము చేయవలెను. కాని తెలిసీ తెలియని వైద్యముచేసినచో వానికన్నులుపోయి నీకు మహాపాతకము చుట్టుకొనును. పశువులను తిండిలేక మాడ్చరాదు. కండ్లకు దగ్గరగాగాని, తలమీదగాని యెంతమాత్రపు కఠినపు దెబ్బ యైనను కొట్టరాదు. అట్లుచేసినచో నోరులేని పశువులు మిగులవిచారము నొంది కండ్లనుండి నీరుగార్చుచు దీనముగా చూచుచుండును. గాన సోదరులగు రైతులారా! మీ పశువులను జాగ్రత్తగాచూచుకొనుడు. రోగములన్నిటిలో

నేత్రరోగము నెమ్మదియగుట కష్టము. అవి మనతో మాటలు చెప్పజాలవుగాన నీ సమీపములోనుండు అనుభవపశువైద్యులకు చూపించి వెంటనే తగుచికిత్సచేయవలెను. కంటివిషయమై ఎంతమాత్రము ఆలస్యముచేసినను ముప్పు తప్పక వాటిల్లును. బండ్లతోలునపుడును, నాగళ్లుదున్నునపుడును, మనరైతులలో కొందరు సాధారణముగా చెండుకర్రను దర్జాగా చేతితోపట్టుకొని ఒడలు తెలియక తమ యిష్టమువచ్చినట్లుగ పశువుకంటిమీదను, మర్మస్థానములందును, తలమీదను, ఇంకను తదితర చోట్లను కొట్టుచుందురు. ఇది మహాక్రూరమైనపని. మనము ఎంతసంతోషముగా పశువును బాధించుచున్నామో ముందు జన్మమున మన కంతబాధయు, పశువునకంతసౌఖ్యమును సర్వేశ్వరుడు తప్పక కలిగించును.

మనయిండ్లదగ్గర లేగదూడలు, కొంచెము పెద్దదూడలు కట్టివేయబడియుండును. అచ్చట చిన్నపిల్లలుఆడుకొనుచు కొంటె పనులుచేయుదురు. దూడలకండ్లలో ఫుల్లలుపెట్టి పొడుచుటయో, క్రిందనున్న పొడిమట్టి కండ్లలోకొట్టుటయో, కఱ్ఱఫుల్లతో నో, త్రాడుతోనో కండ్లకు తగులునట్లు కొట్టుటయో తటస్థించుచుండును. ఈ విషయమై యజమాని జాగ్రత్తగా పరిశీలించుచు తనపిల్లలకు భయముచెప్పినను, చెప్పకపోయినను దూడల కన్నులుమాత్రము చూచి తగిన చికిత్సలు చేయించవలెను.

మీ గ్రామములో పశువైద్యులు లేనిచో మీసమీప గ్రామములోనున్న అనుభవపశువైద్యులకైన చూపించి తగిన



చికిత్సలు చేయించుము. అంతకు సకాలమునకు వైద్యులు దొరకకపోయినను నేను రచించిన పశువైద్యగ్రంథములు చూచియైనను అనుభవముతో చికిత్స చేయవలెను.

నేత్రములలో యే మందైన వేయవలసివచ్చినపుడు మోతాదులు ఎక్కువతక్కువలు గాకుండా మీ పశువైద్యులను కనుగొని జాగ్రత్తగా చికిత్స చేయవలెను.

నేత్రవ్యాధితోనున్న పశువును చలిగాలిలో నుంచరాదు. కంటిమీద ఈగలను వ్రాలనీయరాదు.

నీ పశువుకంటికి చికిత్స చేయించుటకు ఆరంభములో యే వైద్యునిచే చికిత్స చేయించుచున్నావో, ఆతనిచేతనే చికిత్స చేయించవలెనుగాని అందరి సలహాలడిగి అన్నిమందులు తీసికొనివచ్చి పశువుకంటిలో పెట్టరాదు. నీకంతకు పెట్టవలెనని కోరికయున్నచో ఆరంభమునుండి చికిత్సచేయు వైద్యునిసలహా నడిగి చేయుము.

పశువు దేహమునకు వ్యాధి కలిగినపుడు సామాన్యముగా పల్లెరైతులలో పదిమందిచెప్పిన చికిత్సలు చేయుదురు. కాని కంటిజబ్బులవిషయమై అట్లు చికిత్సలుచేసిన తప్పక ముప్పు వాటిల్లును.

నేత్రవ్యాధిగల పశువునకు పెట్టుమేత సులభముగ జీర్ణమగునదిగను, సారవంతమగునదిగను, ఉండవలయునుగాని నిస్సారమైనదిగను, తుక్కుగడ్డి, ముక్కుడుగడ్డి మొదలగునవి యేమాత్రము మేపరాదు.

కంటిమీదను, లోపలనుండు పుండ్లను శుభ్రముగ నుంచవలెను. ప్రతిదినము ఉదయసాయంకాలములు పటికలోషను తోగాని, మైలతుత్తము లోషనుతోగాని శుభ్రముగా కడుగుచుండవలెను.

నేత్రములకు శస్త్రచికిత్సచేసినపుడు కట్టినకట్టువలన లోపలకు గాలి దూరకుండ గట్టిగా కట్టుకట్టవలెను. అకట్టుకు రసి అంటుకొనినయెడల వేడినీటితో శుభ్రముగాకడిగి తర్వాత తగినచికిత్సచేసి జాగ్రత్తతో కట్టుకట్టవలెను. గాలిఏమాత్రము సోకనీయరాదు.

## నేత్రము (The eye)

పశువుయొక్క జ్ఞానేంద్రియములన్నిటిలోను నేత్రములును శ్రోత్రములును మిక్కిలి ముఖ్యమైనవి. సమస్తేంద్రియములలో కన్ను ప్రధానమైనది. కన్ను పశువుయొక్క శరీరమున కుపయోగకరముగనుండు ముందుభాగమందు అనగా శిరస్సుయొక్క ముందరి భాగమునం దుంచబడినది. వస్తువుయొక్క పరిమాణమును, రూపమును, రంగును, స్థానమును తెలిసికొనుట కుపయోగించు యింద్రియ మిదియే. ఇది మృదువైనయింద్రియమగుటచే పశువు లజాగ్రతగ నున్నయెడల దీనికి భంగముకలుగును. ఇది ఒకసారి చెడిపోయిన యెడల దీనిని బాగుచేయుట దుర్లభము. కావున దీనిని కాపాడుటకు సృష్టియందే భగవంతుడు కొన్నియేర్పాటులు చేసియున్నాడు. కంటియొక్కనిర్మాణము బహుఆశ్చర్యకరమైనది. పూర్వకాలమందుండిన ఒకవైద్యుడు దానిని పరీక్షించి చూచిసృష్టికర్తయగు దేవునిస్తుతించుచు నొకకీర్తనవ్రాసె



నట. పశువు తనకంటినన్నిదిక్కులకు త్రిప్పగలుగుటకు భగవంతుడు రెండుకన్నుల నేర్పరచియున్నాడు. దురదృష్టమువల్ల ఒకకన్నుపోయినను రెండవనేత్రము సహాయమగును. పశువుమాతికిరుప్రక్కలను కనుగుంటలనబడు ఎముకలగూడులలో నేత్రగోళము లమర్పబడియున్నవి. ఎదుటిభాగమే గాక నేత్రముయొక్క మిగిలినభాగములన్నియు కనుగుంటలయందుండు ఎముకలచేత సంరక్షింపబడును. నేత్రగోళమునకు వేడిమి కలిగించుటకును, అదురుదెబ్బలవలన దానికి భంగము కలుగకుండునట్లు చేయుటకును దీనిచుట్టును క్రొవ్వుతో చేయబడిన మెత్తని పదార్థముండును. ఇంకను దీనియందు రక్తనాళములును, నీటికాలువలును పోషణనిమిత్తము ప్రవహించుచుండును. కనుబొమలు కనురెప్పల చివరనుండు వెండ్రుకలు నేత్రముయొక్క ముందుభాగమును రక్షించును.

## కనుబొమలు, కనురెప్పలు (Eyebrows and Eyelids)

పశువు కంటిని కాపాడుటకు రెండుమూతలుకూడనున్నవి. వానిపేరు కనురెప్పలు. సూర్యుని వెలుతురు తీక్ష్ణముగా నున్నప్పుడు కనురెప్పలు కన్నులను కాపాడును. నిద్రించువేళ నవి మూసికొనును. ఈ రెప్పలకొనలయందుండు వెండ్రుకలు నేత్రములకు నీడను, అందము నిచ్చుటయేగాక గాలిలో ఎగురుచుండు దుమ్ము, పురుగులు, పదార్థములయొక్క చిన్న చిన్న నలుసులు మొదలగునవి కండ్లలోనికి జారనీయకుండ కండ్లను కాపాడును. కండ్లను బాగుగా కాపాడునవి కనురెప్పలు. ఇవి కంటికి పైభాగమం దొకటియు, క్రింది

భాగమునం దొకటియు నమర్పబడి యుండును. కంటియొక్క పై రెప్ప క్రిందిదానికంటె పెద్దదిగానుండి సుఖముగా కదల్చుటకు వీలుగానుండును. కంటిని మూయుట లేక తెరచుటయు ముఖ్యముగా పై రెప్పచేతనే కలుగుచుండును. కంటిచుట్టునుండు గుండ్రని కండరసహాయముచే ఈ రెప్పలు మూతబడుచుండును. ఈరెప్పల పైవైపున చర్మముతో కప్పబడి అడుగుభాగమున తడి చర్మముతో కూడియుండును. ఈతడిచర్మము పశువు కనురెప్పలయొక్క అడుగుభాగమందుమాత్రమే యుండక వెనుకకుతిరిగి కనుగ్రుడ్లనుకూడ కప్పియుండును. కాబట్టి రెప్పల అడుగుభాగమునందును, కనుగ్రుడ్డుయొక్క పైభాగమందును, ఈ తడి చర్మమే యుండును. ఇంకను కంటిలో నీళ్ళతిత్తి యొకటి గలదు. దానిలోనుండి కన్నీళ్ళువచ్చి కంటి పైభాగమును తడిపి కంటిలో నేవస్తువైనను బడియున్నయెడల దానిని కడిగివేయును. కనురెప్పలమూలముగా కన్నీళ్ళు కంటిమీద వ్యాపించుచుండును. కనుబొమ్మ అనునది కంటికిమీద విల్లువంపులాగున వెంట్రుకలు నిండియుండుభాగము. కనుబొమ్మలు పశువుయొక్క నొసలునకు క్రిందుగను కంటికి పైవైపునను ఏర్పడియున్న వెంట్రుకలవరుసలు. ఇవి పశువుముఖమునకు అందమునిచ్చుటయే గాక నొసలునందు పుట్టు చెమటను కండ్లలోనికి రాకుండజేసి కండ్లను కాపాడుచుండును. కనురెప్ప ప్రక్కనుండు వెండ్రుకలు మిక్కిలి సూక్ష్మమైన వస్తువులు కంటిలోబడకుండ తప్పించుటయే గాక కంటికి నీడను అందమును ఇచ్చుచున్నవి.



## కనుగ్రుడ్డు (Eye ball)

పశువు కనుగ్రుడ్డు గుండ్రముగానుండును. ఇది కనుగుంట యనబడెడు ఎముకగూటిలో నమర్చబడియున్నది. అందువలన సాధారణముగా దీనికి దెబ్బతగులనేరదు. ఇది మిక్కిలికోమలముగా నుండును. కావున దీనిని కాపాడుటకై కనుగుంటయందు ఒక విధమైన క్రొవ్వుపదార్థ ముండును. అది దిండువలె నేర్పడి గ్రుడ్డునకు అదురుదెబ్బ తగులకుండ జేయుటయే గాక ఎముకలతో రాపిడికలుగకుండగను, గ్రుడ్డు నానావిధములు తిరుగుటకును, దానికి వేడినికలిగించుటకు నుపయోగపడుచున్నది. కొన్ని పశువులకనుగ్రుడ్లు గుంటయందు లోతుగా నమర్పబడియుండక మెరకగానుండును. అందువలన కన్నులు పెద్దవిగా కనబడును. కనుగ్రుడ్డు సర్వదా కడగబడుచుండుటకు కొన్నివిచిత్రమైన ఏర్పాటులు గలవు. కనుగ్రుడ్డు బంతివలెనుండి చుట్టును ఆవరణపు పొరలను కలిగియున్నది. దీనిలో పైభాగమునందుండునది పైపొర; దీనినే మనము తెల్లగ్రుడ్డని చెప్పుచున్నాము. దీనికి వెనుకనుండునది మధ్య పొర; ఇదినల్లగానుండుటవలన దీనిని నల్లగ్రుడ్డని చెప్పుచున్నాము. పశువు కనుగ్రుడ్డుయొక్క పైపొర తెలుపురంగుగలిగి మిక్కిలి దృఢమైన నారవంటి పదార్థముతో చేయబడియున్నది. ఇది లోపలనుండు మృదువైన భాగములను కాపాడుచుండును. అన్ని పొరలలోను యిది గట్టిదగుటవలన ఇది సాధారణముగా బ్రద్దలు కానేరదు. ముందరిభాగము కొంచెము గుండ్రముమేరతప్ప ఈ పొర కనుగ్రుడ్డునంతను కప్పియున్నది. ఇంకను ముందరిభాగమున ఉబ్బెత్తుగా కనబడును. పశువు కను

రెప్పలెప్పుడును ఆడుచుండుటచేత నీ తెల్లగ్రుడ్డుయొక్క నునుపును దానిగుండ వెలుతురు పోనిచ్చు శక్తియు కాపాడబడు చుండును. కనురెప్ప లాడుచుండుటచేత తెల్లగ్రుడ్డు ఎప్పుడును తేమగానుండి శుభ్రముచేయుచుండును.

నల్లగ్రుడ్డు పశువుకంటిలోనుండు పైపొరకును లోపలి పొరకును నడుమ నుండును. దీనియందు నల్లని రంగుపదార్థముండుటచేత ఇది నల్లగానుండును. దీనినే నల్లగ్రుడ్డు అందురు. ఈ గ్రుడ్డు కంటికి రంగునిచ్చును. గవ్వకండ్లు, తెనెకండ్లు మొదలగునవి దీనివలననే కలుగుచుండును.

## కంటిలోని పువ్వులు (Ulcers)

### —♦ స్వభావము (Causes) ♦—

పశువు మెదడునుండి కంటిలోపలికి ఒకనరము (optic-nerve) గలదు. అమితమైన వేడిజేసి ఈనరము చెడుటయు గలదు. అందువలన కంటిలో తెలుపుదనము కూడ ఏర్పడును. కంటిలో పువ్వువేసినయెడల నల్లగ్రుడ్డునందు ఒక తెలుపుమచ్చయుండును. దీనినే పువ్వందురు. ఇంకను కంటికి దెబ్బతగులుటవలనను, చిన్నచిన్న నలుసులు కంటిలో పడుటవలనను, వాతరోగముండుటవలన అవి వెలుపలికి రాజాలక అక్కడనే యుండుటవలనను, వాతరోగమువలనను ఈవ్యాధిజనించును.

### —♦ లక్షణములు (Symptoms) ♦—

సహజముగ దీర్ఘచతురస్రాకారముగ నుండు కన్ను పువ్వేర్పడునట్లైన గుండ్రనియాకారమునుపొంది కదలకుండును.



ఏవస్తువైనను దాటవలసివచ్చినచో కంటిలోపువ్వుగల పశువు అక్కడక్కడ నాగిపోవుచుండును. నడచునపుడు కాళ్ళనుపైకి లేపుచుండును. మిఱ్ఱిమిఱ్ఱి చూచుచుండును. కొన్నివేళలలో పువ్వు అద్దమును పోలియుండును. అట్టిచో నేత్రములకు మనము సామాన్యముగా గాజుకన్ను వాడుదుము. వెలుతురు చూచుట కష్టముగానుండి కండ్లవెంబడి నీరుగార్చుచుండును. దీనికి సకాలములో తగిన చికిత్స చేయనియెడల ఈవ్యాధి వృద్ధియై క్రమముగా చూపు తగ్గిపోయి అంధత్వముకూడ యేర్పడును.

### —♦ హెచ్చరిక (Prevention) ♦—

పైన చెప్పబడిన నరము చెడిన పక్షమున ఎట్టి చికిత్సయైనను నిరుపయోగము. పశువును చీకటికొట్టములోనుంచి పరిశుభ్రమగు గాలివచ్చునటుల చేయవలెను. కంటితెలుపుయొక్క ఎరుపుదలభాగము తగ్గువరకు చికిత్సచేయవలెను. కంటిచికిత్సల విషయమై మీ ఫిర్కా ఆయుర్వేద పశువైద్య డాక్టరునకుగాని, తాలూకాగవర్నమెంటు వెటరినరీసర్జన్‌కుగాని చూపించి తగినచికిత్స చేయించవలెను.

### —♦ ఆయుర్వేదచికిత్స (Ayurvedic treatment) ♦—

పటికనీటితో కన్ను శుభ్రముగా కడిగి మిరియాలు ½ తు పిప్పళ్లు ½ తు తెచ్చి కాటుకవలె చూర్ణముచేసి వ్యాసులైనులోగాని వెన్నలోగాని కలిపి నాలుగైదుదినములు ఉదయపుపూట కందిగింజంత పెట్టుచుండిన తగ్గును.

లేక

వారము లేక నెలదినములు వయస్సుగల పసిబాలుని మూత్రిముగాని, మలముగాని కంటిలో పెట్టుము.

లేక

మూడునాలుగు ఇందువుగింజలుకాల్చి పొడిజేసి అందులో సగభాగము పంచదారకలిపి దినమునకు మూడు నాలుగు పర్యాయములు కంటిలో పెట్టవలెను.

లేక

దిరిసెనచెక్కరసము 2 తు ఉప్పు ¼ తు మిరియాలు ¼ తు తెచ్చి నూరి రెండుదినములు కుడికంటిలో పువ్వయిన యెడల ఎడమచెవిలోను, ఎడమకంటిలో పువ్వయిన యెడల కుడి చెవిలోను పోయవలెను.

లేక

పండుగారకాయలోని గుజ్జున్ను, పాతచిల్లపెంకున్ను పొడిజేసి చింతవిత్తులు నిమ్మకాయరసము మెత్తగా నూరి పైపొడి దీనిలోకలిపి కోడిఈకతో నేత్రిములకు పట్టించుము.

లేక

జిల్లేడుపాలు ఒకచుక్క కంటిలో వేయుము.

లేక

మూర్కొండాకు పసరు దొండాకు పసరు కలిపి ఎఱ్ఱగాజుపెంకు మెత్తగా నూరి వస్త్రకాళితము పట్టగా వచ్చిన పొడిని ఆ పసరులో కలిపి కన్నులకు కట్టవలెను.

లేక

సీసము, కర్పూరశిలాజిత్తు సమపాళ్ళు తెచ్చి పొడిచేసి



మెత్తగా నూరి వస్త్రకాళితము పట్టగా వచ్చిన చూర్ణమును, కురువిందపు చూర్ణమును కలిపి కంటిలో వేయుచుండుము.

లేక

2 తులముల సీసములో 10 దానిమ్మపండ్లరసము పోసి కాటుకగా జేసి కన్నులకు పెట్టుడు.

లేక

సాలామిశ్రి ¼ తులము ఖర్జూరకాయలు ¼ తు. గారకాయ ¼ తు. చిల్లగింజలు ¼ తు. మైలతుత్తము ½ తులము కలిపి యేపూట కాపూట సరిపడునంత గంధము తీసి నేత్రిములకు పెట్టుము.

లేక

పొంగించిన పటిక ½ తు మైలతుత్తము ⅛ తు వెన్న 1 తు కలిపి కన్నులకు పెట్టుము.

లేక

దిరిసినపు విత్తుల పలుకులున్ను, కందిపప్పు పలుకులున్ను నిమ్మకాయ రసముతో అరగదీసినగంధము దూదికి పట్టించి కంటిలో పెట్టుచుండవలెను.

లేక

కొద్దిదొండాకుపసరున్ను రెండుమిరియములు తెచ్చి నూరి కండ్లలో పెట్టవలెను.

లేక

మండపసుపుకొమ్ము ఉప్పుగల్లు మిరియము తెచ్చి కాక

రాకుపసరుతోగాని, అవిసెఆకు పసరుతోగాని కంటిలోపెట్టవలెను.

లేక

పొగాకు ఉప్పు రోటిలోవేసి మెత్తగానూరి తెల్లని గుడ్డలో వేసి కంటిలో పిండవలెను.

లేక

దిరిసెనచెక్కరసము, మిరియాలు తగినంత తెచ్చి నూరి రెండుదినములు కుడికంటిలో పువ్వుయినచో ఎడమచెవిలోను, ఎడమకంటిలో పువ్వున్నయెడల కుడిచెవిలోను పోయవలెను.

లేక

సబ్బు చీనాపంచదార మెత్తగానూరి కంటిలోపెట్టుము.

—♦ ఆంగ్లేయ చికిత్స (Allopathic Treatment) ♦—

ఎ, బి, సి లోషన్నువాడుము

అనగా ఆలంలోషన్‌గాని, బోరికులోషన్‌గాని, సిల్వర్ నైట్రేట్‌లోషన్‌గాని వాడుము.

## కంటిలోని పొరలు (Cataracts)

—♦ స్వభావము (Causes) ♦—

ఈ వ్యాధి పశువుయొక్క కంటికి ఒకదానికిగాని, రెండు కండ్లకుగాని రావచ్చును. బింబముగుండ వెలుతురు పోవదు. కనుక చూపు కనపడదు. అనగా కాంతి హీనమైన పొర గప్పియుండును. బింబమంతయు పొరగప్పియున్నపుడు కొన్ని కిరణములు లోపలికి పోవుటచేత కొంచెము చూడగలిగియుండును.



ఈ వ్యాధి పశువులకు మధ్యవయస్సులోగాని, ముదిమివయస్సులోగాని లేక తదితరవ్యాధులవలనగాని రావచ్చును.

—♦ లక్షణములు (Symptoms) ♦—

పశువునకు మొదటి దినము కనుగ్రుడ్డుమీద సన్నముగా మైలపొర క్రమ్మియుండి మరుసటిదినమున ఈపొరమీద మరియొకపొర క్రమ్ముగాని దళసరిగా కాన్పించును. ఈవిధముగా వారముదినములవరకు దినమున కొకపొరవంతున క్రమ్ముకొని గ్రుడ్డంతయు తెల్లబడి తరువాత సన్నని పురుగులు ఆ గ్రుడ్డు పొరలలో బ్రవేశించి అటునిటు తిరుగుచుండును.

—♦ హెచ్చరిక (Prevention) ♦—

కాబట్టి పశువునేత్రమును ప్రతిదినము తెలివిగల వైద్యునకు చూపించవలెను. అందరికి చూపించినచో నీ పశువు స్వర్గలోకమునకు త్వరగా చేరును.

—♦ ఆయుర్వేద (Native) వైద్యము ♦—

సబ్బు 1 తు కలకండ 1 తు తెచ్చి మెత్తగానూరి కంటిలో వారముదినములు పెట్టుము.

లేక

పాలతుత్తము ½ తు అమరశిలగంధకము ¼ తు కుంకుడుపప్పు ½ తు తెచ్చి ఒక్కొక్కటి నూరి తరువాత నిమ్మకాయ పులుసు కలిపి శనగగింజంత కంటిలో పెట్టుచుండవలెను.

లేక

వాకుడాకు పసరులో కలకండమెత్తనిది కలిపి కంటిలో వారముదినములు పెట్టుము.

లేక

ఉప్పువాకుడాకుపసరు వెన్నతోకలిపి రెండువేళల కంటిలో పెట్టవలెను.

లేక

జీడిచమురు కోడిఈకతో తేలికగా కంటిలోపెట్టుము.

——♦ ఆంగ్లేయ (Allopathic) వైద్యము ♦——

సిల్వర్ నైట్రేట్ లోషన్ అప్పుడప్పుడు కండ్లలో వేయుచుండుము.

లేక

ఆలంలోషన్ అప్పుడప్పుడు వేయుచుండుము.

——♦ సారూప్యచికిత్సఅనగా హోమియోపతిక్ వైద్యము ♦——
(Homoeopathic)

పశువు కొంచెముగా చూచుచున్న యెడల ఉబ్బుకొద్దిగా యున్నను బెల్డోనా పల్సటల్లాగాని, యూఫ్రేషియానుగాని, సల్ఫర్ నుగాని వాడవచ్చును. మొదట పైనచెప్పిన మందులను వరుసగా ఒకదానివెంట నొకటి వాడుచుండవలెను. దెబ్బవలన అయినచో అర్నికా వాడుట మంచిది.

## అవిరి (Ophthalmia)

——♦ స్వభావము Causes ♦——

పశువులకు వాతరోగమువలనను, కాకరోగమువలనను, కండ్లకు అదరుదెబ్బలు తగులుటవలనను, మనుష్యులు రాళ్ళు



మొదలగునవి పశువులమీద విసరునపుడు కంటికి తగులుటవలనను, దుమ్ములోనుండు నలకలు పడుటవలనను, ఎప్పుడు చురుకుగానుండి బొల్లిమచ్చలు గలిగి స్వారిచేయుటవలనను ఎద్దులకు, ఈవ్యాధి రావచ్చును. దీనిలో పుట్టఅవిరి, కోడిజుట్టుఅవిరి, గ్రుడ్డుఅవిరి అనునవిగలవి. ఏజాతిదైనను ఆరంభములో చికిత్స చేయవలెనుగాని ముదిరినతరువాత నేమియు లాభములేదు. అవిరికి సరియైన చికిత్సలుచేయక ఎల్లప్పుడు రోగపశువును పనిచేయించుటవలన మెదడుకరిగి కన్నుగ్రుడ్డు కుళ్లిపోయి మాదగా నగును. కాబట్టి చాల జాగ్రత్తగా అవిరిచికిత్స చేయవలెను.

——♦ లక్షణములు (Symptoms) ♦——

పశువు ఎండగాని, వెలుతురుగాని చూడజాలదు. కంటినుండి నీరు విస్తారముగా కారుచుండును. కన్ను రెపరెపలాడుచుండును. రెప్ప లావెక్కి క్రిందిపొర ఒత్తుబారియుండును. ఇంకను రెప్పలమీద సన్ననిపొక్కులుకూడ లేచును. కంటిగ్రుడ్డుమీద దుర్మాంసము పెరుగును. ఈదుర్మాంసము కంటిలోపలినుంచి పుట్టును. ఇట్లు పుట్టినయెడల గ్రుడ్డుచెడినదని గ్రహించవలెను.

——♦ ఆయుర్వేద (Native) వైద్యము ♦——

పశువుకంటిలోపలిభాగమందును, రెప్పలలోను నుండు మలినపదార్థములను తీసివేసి పటికనీటితో కండ్లను శుభ్రముగా కడుగవలెను.

తరువాత

వాకుడాకు పసరు 1 తు వెన్న 2 తు ఉప్పు ½ తు కలిపి ఉదయసాయంకాలములందు కంటిలో పెట్టవలెను.

లేక

పేరినెయ్యి 1 తు పెంకుపొడి ½ తు అరటిదుంప రసము ½ తు కలిపి కంటిలో 5 దినములు పెట్టుము.

లేక

చిల్లగింజను తేనెతో అరగదీసి పచ్చకర్పూరము కలిపి కండ్లయందు పెట్టుము.

లేక

ఉసరికపప్పు 1 తు కరక్కాయపప్పు 1 తు తానికాయ పప్పు 1 తు తెచ్చి మెత్తగానూరి నిమ్మపండ్లరసములో మర్దించి కణికలుచేసి నేత్రములలో పెట్టవలెను.

లేక

కావిరాయి నీటితో అరగదీసి గుడ్డకుపట్టించి కండ్లపైన వేయుము.

—♦ ఆంగ్లేయ (Allopathic) వైద్యము ♦—

హైడ్రోక్లోరైట్ ఆఫ్‌కొకైన్ 2⅛ గ్రెయిన్సు
మోర్నియా 1½ గ్రెయిన్సు
డిస్టిల్డువాటరు 1½ డ్రాములు

ఈ మందును అయిదారు చుక్కల వంతున కంటిలో వేయుచుండవలెను.



లోపలికి

మాగ్నసల్ఫు ½ పౌను వేడినీరు సేరు కలిపి త్రాగించవలెను. కన్నులచుట్టు గ్లిసరీన్ అప్పుడప్పుడు రాయుచుండవలెను.

కన్ను మిక్కిలి బలహీనముగానున్న యెడల

సిల్వర్ నైట్రేట్ 2 గ్రెయిన్సు
లేక జింకుసల్ఫేటు 3 గ్రెయిన్సు
లేక ఆలం 6 గ్రెయిన్సు
నీరు 1 అవున్సు

కలిపి కొద్దిచుక్కలు అప్పుడప్పుడు కంటిలో వేయుచుండవలెను.

లేక

ఆడ్రినలిన్ సెల్యూషను 5 చుక్కలు వేయుము.

—♦ సారూప్య (Homoeopathic) వైద్యము ♦—

యూఫ్రేషియాను కనురెప్పల వాచుట పుండ్లుపడుట వెలుతురును చూడలేకపోవుట మున్నగు వానిలో పనిచేయును. మెర్క్యూరియస్ కనురెప్పలు దళసరెక్కుట, బాధగానున్నపుడు పనిచేయును. బెల్లడోనా ఎక్కువవాపు ఎక్కువబాధ వెలుతురు చూడలేకపోవుటకు పనిచేయును. రూస్టాక్సు కండ్లుఉబ్బుట, ఎఱ్ఱబడుట, నీళ్లుకారుట, వెలుతురు చూడలేనపుడు పనిచేయును.

## కామెర్లు (Jaundice)

—♦ స్వభావము (Causes) ♦—

ఇది పైత్య రససంబంధమగు వ్యాధి. పైత్యరస మధిక

మగునపుడు అది రక్తములోనికి జేరి శరీరమునకును, కండ్లకును పసుపువన్నె గలుగజేయుచున్నది. ఈ వ్యాధి కొలదికాలములో తగ్గుటయు, లేక చాలకాలముండుటయు గూడ గలదు.

—♦ లక్షణములు (Symptoms) ♦—

కండ్లలోని తెలుపు ఆకుపచ్చగాగాని, పసుపువర్ణముగాగాని యుండును. పశువుచర్మము నలుపురంగుతో కూడిన పసుపుఛాయ గలిగియుండును. పశువునకు జ్వరము సోకును. మందకొడిగానుండును. కొమ్ముల మొదళ్లుఎండి వేడిగానుండును. పేగులలో మలబద్ధక మేర్పడును. పశువు శరీరముపై దురద కూడ నేర్పడును. నాలుకమీద ఒకవిధమైన పొర గ్రమ్మును. విరేచనము తెలుపుగాగాని, శేగడివర్ణముగాగాని యుండును. మూత్రము నల్లజేగురురంగుగానుండును. కన్నులువాచి నీరు గారుచుండును. ఆకలి ఎక్కువగానుండును. పశువువిచారముగా నుండును. నెమరు సరిగావేయదు.

—♦ ఆయుర్వేద (Native) వైద్యము ♦—

ముసాంబ్రము 2 తు నేలవేము 1½ తు కలిపి బెల్లపు పానకముతో నాలుగుదినముల కొకసారి యిచ్చుచుండవలెను.

లేక

పిప్పళ్ళు ½ తు మిరియాలు ½ తు మెత్తగా నూరి వెన్నపూసతో కలిపి కంటిలో పెట్టవలెను.

లేక

ఉత్తరేణి ఆకుపసరు 4 తు పెరుగు అర్ధసేరు కలిపి నాలుగుదినములు ఉదయపుపూట త్రాగించవలెను.



లేక

ఊడగపట్టవేరు రసం 3 తు మజ్జిగ అర్ధసేరు కలిపి త్రాగించవలెను.

లేక

గుంటగలిజేరాకురసము కాటుకగాజేసి కండ్లలోపెట్టుము. కన్నుగ్రుడ్డుమీద అవిరిపుట్ట పెరిగిన యెడల శస్త్రము చేయవలసియుండునుగాన మీతాలూకా డాక్టరుగారికిచూపించుము.

—♦ సారూప్య (Homoeopathic) వైద్యము ♦—

మూత్రము విశేషరంగు కలిగి జ్వరలక్షణములుండి పేగులు ముడుచుకొనినచో ప్రతి 3 గంటల కొకసారి ఒక మోతాదువంతున ఈయవలెను.

శరీరమంతయు పసుపురంగుగా నున్నపుడు మెర్క్యూరియస్ అను మందును ప్రతి 3, 4 గంటలకు వాడిన మంచిపని చేయును. ఆకలిలేనప్పుడు ప్రతి మూడు గంటలకొకసారి 2 గ్రెయినుల వంతున ఈయవలెను. పచ్చిమేత ఆహారముగా నీయవలెను.

—♦ ఆంగ్లేయ (Allopathic) వైద్యము ♦—

అప్పుడప్పుడు బోరికు లోషన్ వాడుము. లేక అలం లోషన్ వాడుము.

## కంటిజబ్బు (Common Eye Disease)

—♦ స్వభావము (Causes) ♦—

పశువు కంటికి గాయము తగులుటవలనను, శరీరము లోపల వ్యాధి యేర్పడుటవలనను, కొరడాతో కంటిమీద

కూ్రరముగా కొట్టుటవలనను, రాళ్ళు మట్టిగడ్డలు మొదలగు నవి విసరునపుడు కంటికి తగులుటవలనను, పశువునకు సరిగా మేత మేపక ఉపవాసవ్రితములు నేర్పుటవలనను, ఎల్లపుడు పశువు దీనముగా విచారముగా నుండుటవలనను, తలపైన అదరుదెబ్బలు తగులుటవలనను, కండ్లకు అవిరిసోకుటచేతను, చెమటపట్టి కంటిలో జీర్ణమగుటవలనను కంటికిజబ్బు ఏర్పడును.

—♦ ఆయుర్వేద (Native) వైద్యము ♦—

కందిగింజలపై పొరతీసి సానమీద నీటితో అరగదీసిన గంధమును అప్పుడప్పుడు కంటిలో పెట్టుచుండుము.

లేక

చిల్లగింజ తేనెతో గంధముతీసి పచ్చకర్పూరమునుచేర్చి కంటికిపెట్టుము.

—♦ సారూప్య (Homoeopathic) చికిత్స ♦—

యూఫ్రేషియా, కాల్కేరియాకార్బ, రూటాటింక్చర్ పనిచేయును.

—♦ ఆంగ్లేయ (Allopathic) వైద్యము ♦—

ఆలం— 4 గ్రెయినుు డిస్టిల్డువాటరు - 1 ఔన్సు కలిపి కండ్లలో వేయుచుండుము.

మెదటిభాగమునకు క్యాస్టర్ ఆయిల్ మర్దన చేయుచుండుము.

లేక

బోరిక్ ఆసిడ్ లోషనును ఉపయోగించుము.



## కంటితెలుపు (Amaurosis)

—♦ స్వభావము (Causes) ♦—

నీటినే నీటికాసు లందురు. పశువుకనుగ్రుడ్డునకు దెబ్బ తగులుట వలనను, వాతము జలుబు రోగమువలనను, ఇంకను దుమ్ములోనుండు చిన్నచిన్న నలకలు మొదలగునవిపడి కంటిలో నిలవయుండుట వలనను కలుగుచుండును.

—♦ లక్షణములు (Symptoms) ♦—

మొదట కన్ను ఎరుపెక్కి నీరు గారుచుండును. పోటు కలుగును. పుసులు కట్టును. వెంటనే తెలుపు పుట్టి క్రమ క్రమముగా కన్నంతయు వ్యాపించును. తుదకు కన్నంతయు తెలుపురంగుగా నుండి గవ్వ ఆకారముగా నుండును. పశువు తక్కెనలాడును. మాటిమాటికి పశువు తన కంటిరెప్ప పైకెత్తుచుండును. ఎక్కువగా దెబ్బతగిలి తెలుపు పుట్టిన కంటియొక్క కనురెప్పలు మూసికొనిపోయి తెరచుటకు కష్టమగుచు వెలుతురును చూడజాలక బాధపడుచుండును.

—♦ ఆయుర్వేద। (Native) వైద్యము. ♦—

పశువును వెలుతురు వచ్చుస్థలమునందుమాత్రము కట్టవలెను. మామూలుకంటె మేత తగ్గించి పెట్టవలెను.

సొంటి 1 తు పిప్పళ్లు 1 తు మిరియాలు 1 తు మెత్తగా నూరి వస్త్రఘాళితముచేసి తగినంత వెన్నతో కలిపి పెట్టవలెను.

లేక

అయిదు పచ్చగాజులు తెచ్చి కాల్చి భస్మముచేసి నిమ్మకాయరసముతో నూరి కంటిలో పెట్టుము.

లేక

ఏనుగకాలిగోరు నీటితో అరగదీసిన గంధము కంటిలో పెట్టుము.

లేక

శిలాజిత్తును శుద్ధిచేసి వెన్నతో కలిపి కంటిలో పెట్టవలెను.

లేక

మిరియాలు 1 తు అక్కలకర్ర ½ తు లవంగాలు ½ తు ఉప్పుడుబియ్యము 1 తు తెచ్చి నూరి నిమ్మకాయ రసములో కలిపి కోడియీకతో కంటికి రాయవలెను.

లేక

పిప్పళ్ళు, సీసము, సీసాపెంకు సమానభాగములుగా తెచ్చి పొడిజేసి గొట్టములో పోసి పారఊదుము.

లేక

దినమునకు రెండుతులముల అల్లము వంతున వారము దినములు తినిపించుము.

—♦ సారూప్య (Homoeopathic) వైద్యము ♦—

అర్జెంటంనైట్రికంగాని, బెల్డోనాగాని, పల్సటిల్లాగాని, సల్ఫర్‌గాని, వాడిన బాగుగా పనిచేయును.

—♦ ఆంగ్లేయ (Allopathic) వైద్యము ♦—

సిల్వర్ నైట్రేట్ 2 గ్రెయిన్సు డిస్టిల్డువాటరు 1 ఔన్సు కలిపి సీసాలో నుంచుకొని అప్పుడప్పుడు కంటిలోవేయుచుండవలెను.



లేక

జింకుసల్ఫేట్ 3 గ్రెయిన్సు డిస్టిల్డువాటరు 1 ఔన్సు కలిపి అప్పుడప్పుడు కంటిలో వేయుచుండుము.

## కండ్ల ఎరుపు-నీరుకారుట (Inflammation of the eye ball)

—♦ స్వభావము (Causes) ♦—

రక్తరోగమువలనను, అతివేడివలనను. కండ్లలో ధూళి మున్నగునవి పడుటవలనను, విసుగువిరామములేక రాత్రింబవళ్లు పనిచేయించుటవలనను, ఈ వ్యాధి పశువులకు కలుగును. కొన్ని పశువులకు చిన్ననాటినుండియు విడువక కండ్లనుండి నీరుగారుచుండును. పశువు మెదటిలో పుట్టినవ్యాధియే దీనికి కారణమైయున్నది. ఈ వ్యాధి వంశపరంపరముగ వచ్చుటయు కొన్ని పశువులలో కలదని కొన్ని పశువైద్యశాస్త్రములు తెలుపుచున్నవి. అధికవాతముగల పశువులకు కూడ నీరుగారుచుండును.

—♦ లక్షణములు (Symptoms) ♦—

పశువునకు గుడ్డుపైపొర వాచి ఎర్రబడును. కన్నీరు వేడిగానుండును. కంటిలో ఎరుపుజీరలుకూడ యుండును. పశువు కన్ను మిక్కిలి ఎరుపుగానున్నచో వెలుతురును కూడ చూడజాలదు. ఇంకను పశువు మురికిగానున్నచో కొన్ని సూక్ష్మజీవులు కంటిలోనికి ప్రవేశించి పుసులు కట్టుచుండును.

—♦ ఆయుర్వేద(Native) వైద్యము ♦—

పశువునకు వెలుతురు ఎండ అంతగా తగులనీయరాదు. కండ్లను ఉదయవేళలయందు వగరునీటితో కడుగుచుండవలెను.

పశువుకన్నులు మిక్కిలి ఎరుపుగానున్నచో 30,40 తులముల ఆముదము త్రాగించుము.

లేక

కందిగింజల గంధము కండ్లలో రెండువేళల పెట్టుము.

లేక

పశువుమాడుపట్టున ఆముదముకాచి రెండుమూడు దినములు పెట్టుము.

లేక

పొంగించిన పటిక అరతులము తెచ్చి దానిలో సూక్ష్మముగా నల్లమందు వేసి చింతాకురసముతో కాలవేసిన వేడిపారమీద మర్దనచేసి కండ్లకు పెట్టుము.

—♦ ఆంగ్లేయ (Allopathic) వైదము ♦—

యల్లో ఆయంటుమెంటు దినమున కొకసారి కంటిలో పెట్టుము.

## కన్నులు పుసులుకట్టుట

—♦ స్వభావము (Causes) ♦—

పశువును విసుగు విరామములేకుండ పనిచేయించుటవలనను, వాతరక్తరోగములవలనను, ఇంకను కంటికిగాని, తలకుగాని, అదరుదెబ్బలు తగులుటవలనను, ఎండలో పనిచేయించుటవలనను, అతివేడివలనను, నేత్రగోళములలో జబ్బుండుటవలనను ఈవ్యాధికలుగుచుండును.

—♦ లక్షణములు (Symptoms) ♦—

కన్నులెఱ్ఱబడుటయుగలదు. నీరుకారుచుండును. దురద



కూడ నుండవచ్చును. కన్నుల మొదటిభాగమందు పుసులు నీరు కారుచుండును. ఆస్థలమునందె గడ్డలుకట్టియుండును. చూచుటకు పశువు చాల అసహ్యాకరముగానుండును. ఈగలు కూడ ఆ గడ్డలమీాద ముసిరి కండ్లను చెరుపును.

—♦ ఆయుర్వేద (Native) వైద్యము ♦—

ప్రతిదినము పశువుమాడున ఆముదము కాచి పోయుచుండవలెను. ఇట్లు నాలుగైదుదినములు చేయవలెను. పటికనీటితో కండ్లు కడుగుచుండుము.

లేక పసుపుగాని కుంకుమగాని కండ్లలో పెట్టుము.

లేక సారచేపతలలోనిరాయి, ఖర్జూరపుగింజ చనుబాలతో అరగదీసి కంటిలో పెట్టుము.

లేక శిలాజిత్తు భస్మమును వెన్నతో కలిపి అప్పుడప్పుడు పెట్టుము.

—♦ సారూప్య (Homoeopathic) వైద్యము ♦—

రూస్టాక్సు, యూఫ్రేషియా, నేట్రమ్మూరు వాడవచ్చును.

—♦ ఆంగ్లేయ (Allopathic) వైద్యము ♦—

బోరిక్ లోషన్‌గాని, ఆలంలోషన్‌గాని అప్పుడప్పుడు వేయుచుండుము.

## రేజీకటి (Defects of Vision)

—♦ స్వభావము (Causes) ♦—

కొన్నిపశువులకు రాత్రిపూట కండ్లు ఏమాత్రమును

గన్పించవు. ఈ వ్యాధిని పశువుయొక్క చర్యలను బట్టి కనుగొనవలసినదే గాని సాధారణముగా నేత్రపరీక్షవలన తెలిసికొనుట దుస్తరము. కొన్నిదూడలు పుట్టినవారముదినములలోనే ఈ వ్యాధిజనించును. ఈవ్యాధికూడ వంశ పరంపరముగ వచ్చునని కొందరు డాక్టర్లు చెప్పుచున్నారు. ఇంకనుఫ్యాక్టరీలలోనుండు తవుడును విస్తారముగా మేపుటవలనను పిల్లిపెసరను నెలలకొలది మేపుటవలనను కండ్లకు అతివేడిజేసి ఈవ్యాధి రావచ్చును.

—♦ లక్షణములు (Symptoms) ♦—

ఈవ్యాధిగల పశువులు పగలు బాగుగనే చూడగలవు గాని రాత్రిపూటమాత్రము చూడజాలవు. రాత్రిపూట బుట్టలలో ఆహారపదార్థములుంచి ఎదుటనుంచిన యెడల రేజీకటిగల పశువులు ఇటునటు వెదకుకొనుచుండును. ఒక దొడ్డినుండి మరియొక దొడ్డికి తోలినయెడల పశువునకు త్రోవసరిగా కన్పించక గోడలకు గోతులకు చెట్లకు అడ్డుపడిపోవుచుండును. మంచి వెన్నెలగాయుచున్నపుడు మాత్రము వీని కొకమాదిరిగ కన్పించును.

—♦ ఆయుర్వేద (Native) వైద్యము ♦—

నేత్రములలో ఆవువెన్నపెట్టి చన్నీళ్లుకొట్టుము

లేక, ములగాకురసము తేనెతోకలిపి కండ్లకుపెట్టుము

లేక, గానుగవేరు తేనెతోఅరగదీసి కండ్లకుపెట్టుము

లేక, జాజికాయ తేనెతో అరగదీసిపెట్టుము



లేక, ఒకటి రెండు చుక్కలు నీరుల్లిపాయరసము కండ్లలో పిండుము

లేక అవిసెపువ్వుల రసము నలకలులేకుండ శుభ్రమైనది పోయుము

లేక సజ్జలు విసరి పిండిపెట్టుము.

—♦ సారూప్య (Homoeopathic) వైద్యము ♦—

బెల్లడోనా, పల్సటిల్లా, సల్ఫర్, అర్జెంటైనానువాడుము.

—♦ ఆంగ్లేయ (Allopathic) వైద్యము ♦—

సిల్వర్ నైట్రేట్ లోషనును వాడుము.

లేక

అర్జరాల్ 50 గ్రెయిన్సు నీరు 1 ఔన్సు కలిపి వాడవలెను.

## కండ్ల కలక (Inflammation of the eye)

—♦ స్వభావము (Causes) ♦—

గుడ్డుయొక్క పై పొరవాచుటవలనను, పశువు ఇసుకలో తలను ఆనించి నిద్రించుటవలనను, చలిగాలివలనను, కంటికి దెబ్బతగులుటవలనను, శీతోష్ణస్థితి హఠాత్తుగా మారుటవలనను ఈ వ్యాధివచ్చును. ఇది అంటుసంబంధమైనది.

—♦ లక్షణములు (Symptoms) ♦—

వెలుతురును సహించలేకపోవును. కండ్లనుండి నీరుగార్చును. కంటిలో పుసులుకట్టును. కనురెప్ప లుబికివెచ్చగానుండును.

కంటిపొరలలో అక్కడక్కడ పొక్కులు లేచును. కంటియందు ఇసుక రేణువు లున్నట్లు గరగరలాడుచుండును.

—♦ ఆయుర్వేద (Native) వైద్యము ♦—

తెల్ల వాకుడుకాయరసము కండ్లలో పెట్టుము.

లేక

పిప్పళ్ళు ½ తు మిరియాలు ½ తు మెత్తగా నూరి వెన్నపూసతో కలిపి కండ్లకు పెట్టవలెను.

లేక

గుంటకలగరాకు పసరుతో మిరియపుగింజ లవంగపు మొగ్గ అరగదీసి కండ్లకు పెట్టుము.

లేక

నందివర్ధన పండుటాకులరసము కండ్లలో పిండుము.

లేక

తడిపసుపుగుడ్డగాని కావిరాయిగుడ్డగాని కండ్లపైన నుంచుము.

లేక తుమ్మచెట్టునకు పట్టు ఒకవిధమైనపురుగుగూడు తెచ్చిదానిలో నుండు పురుగుల రసము కంటిలో పెట్టుము.

లేక అరటిదుంపసాన కండ్లలో పెట్టుము

లేక ఆరెచెట్టురసము పెట్టుము.

—♦ సారూప్య (Homoeopathic) వైద్యము ♦—

దెబ్బతగిలి ఈవ్యాధి కలిగినపుడు ఆర్నికాఅనుమందును ప్రతి 3, 4 గంటలకు వాడవలెను.



చలివలన ఆర్నికా పనిచేయనపుడును, అకోనిటంను వాడవలెను.

వ్యాధి తీవ్రత తగ్గి కండ్లు ఎఱ్ఱబడి పుసులు తగ్గక కనురెప్పలు వాపుజెంది యున్నపుడు బెల్లడోనాను వాడవలెను.

ముక్కురంధ్రములనుండి, కండ్లనుండి నీరుకారుచున్నయెడల వెలుతురు చూడలేనపుడును యూఫ్రేషియాను వాడవలెను.

పసుపుపచ్చని ద్రవముకారుచు కనురెప్పలువాచి కంటిలోని పొర మబ్బురంగుగా నున్నపుడు మెర్క్యురియస్ కర్ ను వాడవలెను.

దీర్ఘవ్యాధికి సల్ఫర్ ను వాడవలెను.

బలహీనతవలన కన్నులు లేక నీరుకారు కన్నులు 1 భాగము పటిక 10 భాగముల నీరుకలిపి మూడు నాలుగు పర్యాయములు పోయుచుండిన తగ్గును.

పటికలోషన్‌తో కండ్లుకడిగి అకోనిటంనాప్ 1 X, బెల్లడోనా 1 X ఒకటి తరువాత నొకటి నాలుగుగంటల కొకసారి 10 చుక్కలు పోయవలెను.

లేక యూఫ్రేషియా 1 X ఈయవలెను. ఈమోతాదులో సగము దూడలకు ఈయవలెను. కండ్లపైన గుడ్డ వేయవలెను. వెలుతురు వేడి తగులకుండ నుంచవలెను.

—♦ ఆంగ్లేయ (Allopathic) వైద్యము ♦—

జింకు సల్ఫేస్‌లోషన్‌గాని లేక బోరికు ఆసిడ్ 9 గ్రెయిన్సు డిస్టిల్డువాటరు 1 ఔన్సుకలిపిన చుక్కలుగాని వేయవలెను.

## కండ్లదృష్టి తగ్గుట (Amblyopia)

—♦ స్వభావము (Causes) ♦—

పశువులను రాత్రివేళలందు బండ్లుకట్టి రోడ్లమీద తమ పొలములకు షట్టి వగైరాలుతోలుటవలన మోటారు లైటుల వెలుతురు, గ్యాసులైటులవెలుతురు, ఎక్కువగా తగులుటవలన దృష్టితగ్గుచుండును. ఇంకను మిడిమిడిఎండలో పనిచేయుటచేతను, ఆసూర్యరశ్మికండ్లకు తగిలి దృష్టితగ్గుచుండును. ఇంకనుమురికినీరు త్రాగించుటచేతను, కావలసినంత వెలుతురులేనిచోట్ల పశువులను కట్టుటచేతను, చెడునీరు కండ్లలో ప్రవేశించుటచేతను ఈవ్యాధి కలుగుచున్నది. ఇంకను నరములదోషమువలనను, రక్తహీనత వలనను కలుగుచుండును.

—♦ ఆయుర్వేద (Native) వైద్యము ♦—

పదిమిరియములు పొడిచేసి తుందిలపాకురసములో కలిపి అప్పుడప్పుడు కన్నులలో పెట్టుచుండుము.

లేక పచ్చకర్పూరము, పంచదార సమానభాగములు కలిపి ఆవువెన్నతో నూరి కండ్లకుపెట్టుము.

లేక సొరచేపమలము 10 దినములు కంటిలోపెట్టుము లేక నీరుల్లిపాయ రసము పోయుము



లేక తిప్పతీగె రసము, సొంటిరసము, సైంధవలవణము నూరి కన్నులకు పెట్టవలెను.

—♦ సారూప్య (Homoeopathic) వైద్యము♦—

సల్ఫర్, మెర్క్యుకర్, పల్సటిల్లాను వాడవచ్చును.

—♦ ఆంగ్లేయ (Allopathic) వైద్యము ♦—

పొటాషియం అయోడైడ్ 10 గ్రెయిన్సు హైడ్రాజిరీ అయోడైడ్ రుబ్రిం 5 గ్రెయిన్సు కంజిలోకలిపి 10 దినములు 3 వేళల ఈయవలెను.

ఆలంలోషన్‌గాని, జింకులోషన్‌గాని, బోరికులోషన్‌గాని అప్పుడప్పుడు కంటిలో వేయుచుండవలెను.

## కంటిమాద

—♦ స్వభావము Causes) ♦—

ఈ వ్యాధి అవిరిముదిరిన తరువాత వచ్చును. ఇది చాల ప్రమాదకరమైనది. ఎక్కువగా పాటుపడుచు చురుకుగా స్వారి చేయుబొల్లిమచ్చలుగల ఎద్దులకు తరచుగా గలుగుచుండును. కనుగ్రుడ్డుపైన కొయ్యగండలు పెరిగి క్రమేపి కన్నుగ్రుడ్డు కుళ్లి పోవును. దీని కెటువంటి చికిత్సలుచేసినను లాభములేదు. ప్రత్యేకముగా మీతాలూకా పశువులడాక్టరుచే కన్నుతీసి వేయించుట మంచిది. లేనిచో ఈదోషము రెండవ కంటికికూడ వచ్చును. ఈకన్ను తీసినప్పటికి కూడ నీరుకట్టనిచో ఆపశువు త్వరలో చనిపోవగలదని గ్రహించవలెను. అందుచేతనే దీనికి కంటిమాద యని పేరువచ్చినది.

—♦ లక్షణములు (Symptoms) —♦

పశువు నోరులేనిదిగాన అది పడుబాధ భగవంతుని కెరుక. చికిత్సచేసే వైద్యుని కెరుక. కంటిచుట్టు వాతలుపెట్టుదురు. ఇందువలన పశువున కపాయము గలుగుటయేగాక పశువు మరణించును. నోటివెంట చొంగ పడుచుండును. వ్యాధి ముదిరిన కొలది కంటినుంచి రక్తము కారుచుండును. కన్ను భీకరాకారముగా నుండును. కనుగుడ్డు ఎరుపుగ నుండును. లేక గుడ్డు దుర్మాంసముచే కప్పబడియుండును. ఎల్లప్పుడు విచారముగా నుండును. ముదిరినకొలది ఈగలు కంటిచుట్టు మూగి గుడ్డును తినివేయును. క్రమేపి వాతముగ్రమ్మి పశువు మరణించును.

—♦ ఆయుర్వేద (Native) వైద్యము ♦—

దుర్మాంసమును గోటితోగాని, కత్తెరతోగాని తీసివేసి మిరియాలపొడిలో పచ్చకర్పూరము తగినంతగా కలిపి కంటిలో పెట్టవలెను.

లేక అప్పుడప్పుడు పటికనీటి చిక్కని బిందువులు పోయుచుండుము.

—♦ ఆంగ్లేయ Allopathic) వైద్యము ♦—

మా తాలూకా వెటరినరీ డాక్టరుగారిచే కన్ను తీయించుట నాముఖ్యోద్దేశ్యము. ఎన్ని చికిత్సలు చేసినను లాభము లేదు.

## కనురెప్పలచివర పొక్కులు లేచుట
## (Stye - Hordeoleum)

పశువు కనురెప్పల పొక్కులు లేక కురుపులు బయలు



దేరి బాధనుకలుగజేయును. ఈపొక్కులు తెలుపుగను, గట్టిగను యుండును. ఇవి కనురెప్పలపై వైపునకుగాని, లోపలివైపునకు గాని చితికి క్రొవ్వువంటి పదార్థము వెడలుచు ఎక్కువబాధను, రెప్పలయంతటను వాపును గలుగజేయును.

—♦ ఆయుర్వేద (Native) వైద్యము ♦—

పొక్కులకు మండపసుపుకొమ్ము అరగదీసి దానిలో కొంచెము గంధకముకలిపి పట్టించవలెను.

లేక మామిడి ఆకులనడుమ ఈనెలుకాల్చి మసిచేసి నీటితో కలిపి కురుపులకు పట్టించవలెను.

లేక పటికపొడి 1 తు పసుపు 1 తు వేపనూనె ½ తు కలిపి అప్పుడప్పుడు పట్టించవలెను.

—♦ ఆంగ్లేయ (Allopathic) వైద్యము ♦—

కార్బాలిక్ ఆయిలుగాని టించ్చర్ అయోడిన్‌గాని అప్పుడప్పుడు కురుపులకు పట్టించుచుండుము.

బోరికు ఆయంటుమెంటు రుద్దుము.

## కొయ్యగండలు పెరుగుట (Trachoma)

పశువు రెప్పలు బిరుసెక్కును. కంటిరెప్పలచుట్టు కొయ్యగండలు పెరుగును. ఇవి గుడ్డుమీద కాకుండ తదితరభాగముల మీద పుట్టును. వీటివలన పశువు బాధపడుచుండును.

—♦ ఆయుర్వేద (Native) వైద్యము ♦—

బ్రహ్మదండి చెట్టు సమూలము ఉప్పుతో మెత్తగా నూరి గాయమునకు పట్టించవలెను.

లేక కొబ్బరి, నల్ల జీడివిత్తులు కలిపి ప్రతిదినము ఉదయపు పూట తినుపించుచు ఆగాయమునకు కొత్తసున్నము గాడిదగడ పాకుపసరు కలిపి పట్టించుము.

లేక మైలతుత్తము, గంధకము, పాదరసము, సమాన భాగములు తమలపాకురసముతో కంచుపళ్లెమువిూద నూరి గాయమునకు పట్టించుము.

లేక మైలతుత్తము, సూరేకారము, రాతిసున్నము సమపాళ్లు తెచ్చి నిమ్మకాయరసముతో నూరి గాయమునకు పట్టించుము.

## నేత్రవముల కొలుకులలో దుర్మాంసము పెరిగినచో

దుర్మాంసమును శస్త్రముచేసి పసుపుకొమ్మును కాల్చి అంటించుము.

లేక మిరియాలు మెత్తగానూరి కొలుకులకు అంటించుము

లేక సూరేకారము పసుపు మెత్తగా నూరి నేత్రములలో పారఊదుము.

లేక కుంకుమపువ్వు, కరక్కాయ ఆముదము సమాన భాగములు నూరి కలబందమట్ట రసముతో తేనెకలిపి కాటుకగాచేసి కండ్లలో పెట్టుము.

లేక కవిరి, వెలిగారము, పటిక, కొబ్బరినూనె, ఆవు వెన్నతో కలిపి కండ్లకు పెట్టుము.



## కంటిలో నితరవస్తువులు పడుట
(Foreign bodies in the eye)

పశువుకంటిలో నలకలు, దుమ్ము రేణువులు, పురుగులు మొదలగునవిపడి బాధకలిగించును. అట్టిసమయములలో ఈ క్రిందివిషయములను గ్రహించవలెను.

1 పశువు కన్నుమూసి కన్నీటిని కారించుట మంచిది. ఆ నీటిప్రవాహములో దుమ్ము రేణువులు కొట్టుకొని పోయి సౌఖ్యము కలుగును.

2 లేనియెడల కంటిని కడుగుటమంచిది.

3 వెచ్చని నీటినిదెచ్చి కంటిలోనికి పిచ్చికారితో కొట్టవలెను.

4 పుల్లగాని, పేడుగాని గుచ్చుకొనినయెడల జాగ్రత్తగాతీసి బోరిక్ ఆసిడ్ లోషన్ కంటిలో వేయుచు వేడినీటి కాపులు తీయించవలెను.

5 మేకుగాని, తుప్పుపట్టిన రేకుగాని గుచ్చుకొనిన యెడల నెమ్మదిగా తీసివేసి యల్లో ఆయంటుమెంటు తేలికగా పెట్టుచుండవలెను.

6 పుల్లగాని, మేకుగాని గుచ్చుకొని కన్నువాచినగాని పై చికిత్సలవలన నొప్పులు తీయనియెడల కొలుకులలో ఆముదపుచుక్కలను విడువవలెను.